# వరంగల్ వాయిస్
Evening Daily

సంపుటి : 05 | సంచిక : 037
పేజీలు : 08 | వెల: రూ.5/-

శుక్రవారం
జనవరి 16, 2026

www.epaper.warangalvoice.net | www.warangalvoice.net




8లో..


## ఫలించిన ఎంపీ కృషి

- ఆకాశవాణి క్వార్టర్స్‌లో వెల్‌నెస్ సెంటర్
- అధికారిక ఉత్తర్వులు జారీ చేసిన కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ
- నిర్విరామంగా కృషి చేసిన డాక్టర్ కడియం కావ్య



# మేడారంలో.. కేబినెట్ భేటీ

వివరాలు2లో..






తెలంగాణ రాష్ట్ర చరిత్రలోనే కాదు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ చరిత్రలోనే ఒక అరుదైన ఘట్టం ఆవిష్కృతం కానుంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో రాష్ట్ర మంత్రివర్గ సమావేశాన్ని ఈ నెల 18 న గిరిజనుల ఆరాధ్య దైవం మేడారం సమ్మక్క-సారలమ్మల సన్నిధిలో నిర్వహించాలని నిర్ణయించారు. సాధారణంగా సచివాలయంలో మాత్రమే నిర్వహించే కేబినెట్ భేటీని ఈ సారి సంప్రదాయానికి భిన్నంగా మారుమూల ప్రాంతంలోని ములుగు జిల్లాలోని మేడారంలో నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. సాయంత్రం 5గంటలకు ప్రారంభం కానున్న మంత్రివర్గ సమావేశానికంటే ముందుగానే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితోపాటు రాష్ట్ర మంత్రి వర్గం మొత్తం మేడారం చేరుకొని మంత్రివర్గ సమావేశంలో పాల్గొననున్నారు. ఆసియాలోనే అతిపెద్ద గిరిజన జాతరగా పేరొందిన 'సమ్మక్క-సారలమ్మ మేడారం మహాజాతర' ఈ నెల 28 న ప్రారంభం కానున్న నేపథ్యంలో ఇక్కడ నిర్వహించనున్న మంత్రివర్గ భేటీకి ప్రాధాన్యం సంతరించుకుంది. వారంతా రాత్రి అక్కడే బస చేసి 19వ తేదీ ఉదయం శాశ్వత ప్రాతిపదికన నిర్మించిన అమ్మవార్ల నూతన ప్రాంగణంతోపాటు ఇతర అభివృద్ధి పనులను సీఎం చేతుల మీదుగా ప్రారంభించనున్నారు. అనంతరం అమ్మవార్లను దర్శనం చేసుకొని మొక్కులు చెల్లించుకోనున్నారు.

- వరంగల్ వాయిస్, మేడారం

- 18న సీఎం నేతృత్వంలో మంత్రివర్గ సమావేశం
- హోటల్ హరితలో సాయంత్రం 5 గంటలకు మీటింగ్
- సంప్రదాయానికి భిన్నంగా నిర్ణయం
- హాజరుకానున్న రాష్ట్ర మంత్రులు
- 19న అమ్మవార్ల ప్రాంగణం ప్రారంభం
- తర్వాత తల్లుల దర్శనం, మొక్కుల చెల్లింపు
- ఏర్పాట్లు చేస్తున్న జిల్లా యంత్రాంగం



8లో..

## ప్రభుత్వ ఆదాయానికి రూ.3.72కోట్ల గండి

- పోలీసుల అదుపులో 15 మంది నిందితులు
- పరారీలో మరో 9 మంది



2లో..

## వరద ప్రాంతాల్లో.. కేంద్ర బృందం పర్యటన

- దెబ్బతిన్న పంటలు, రోడ్లు, ఇండ్ల పరిశీలన



8లో..

## శ్రీ దూడల మల్లికార్జున స్వామి జాతరలో ఎర్రబెల్లి

2లో..




## ఒకే ఇంట్లో ముగ్గురికి 'సర్కారీ' కొలువులు

ఆదర్శంగా నిలుస్తున్న అక్కాచెల్లెళ్లు



# మేడారంలో.. కేబినెట్ భేటీ


MOST IMMEDIATE:
CABINET MEETING:

GOVERNMENT OF TELANGANA
GENERAL ADMINISTRATION (CABINET) DEPARTMENT

U.O.Note No.09/Cabinet/A2/2026-1 Dated:16.01.2026

Sub: Cabinet Meeting – Meeting of the Council of Ministers is on 18.01.2026 at 05.00 PM at Haritha Hotel, Medaram, Mulugu District – Intimation – Regarding.

****

The Meeting of the Council of Ministers is proposed to be held on 18.01.2026 at 05.00 PM at Haritha Hotel, Medaram, Mulugu District.

2. You are therefore, requested to make it convenient to participate in the above said meeting.

K. RAMAKRISHNA RAO
CHIEF SECRETARY TO GOVERNMENT

- 18న సీఎం నేతృత్వంలో మంత్రివర్గ సమావేశం
- హోటల్ హరితలో సాయంత్రం 5 గంటలకు మీటింగ్
- సంప్రదాయానికి భిన్నంగా నిర్ణయం
- హాజరుకానున్న రాష్ట్ర మంత్రులు
- 19న అమ్మవార్ల ప్రాంగణం ప్రారంభం
- తర్వాత తల్లుల దర్శనం, మొక్కుల చెల్లింపు ఏర్పాట్లు చేస్తున్న జిల్లా యంత్రాంగం

**వరంగల్ వాయిస్, మేడారం :** ఈ నెల 18న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మేడారం పర్యటించనున్నారు. రూ.251 కోట్లతో చేపట్టిన శాశ్వత పనులను ఆయన పరిశీలించనున్నారు. పనిలో పనిగా ఇక్కడే మంత్రివర్గ సమావేశాన్ని నిర్వహించాలని నిర్ణయించారు. గతానికి భిన్నంగా తీసుకున్న ఈ నిర్ణయంతో అందరూ ఒక్కసారిగా ఖంగుతిన్నారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రంతోపాటు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో కూడా గతంలో ఎన్నడూ లేని విధంగా సచివాలయం విడిచి మారుమూల ప్రాంతంలో మంత్రివర్గ సమావేశాన్ని నిర్వహించడం మొదటిసారి. సంప్రదాయానికి భిన్నంగా తెలంగాణలోని మారుమూల గిరిజన ప్రాంతంలో కేబినెట్ భేటీ కావడం ప్రాధాన్యం సంతరించుకుంది. మేడారంలోని హోటల్ హరితలో ఆదివారం సాయంత్రం 5గంటలకు మంత్రివర్గ విస్తృత స్థాయి సమావేశం జరుగనుంది. దీంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో సహా రాష్ట్ర మంత్రివర్గమంతా 5గంటలకంటే ముందుగానే మేడారం చేరుకోనున్నారు.

**ఖమ్మం నుంచి మేడారానికి..**

ఈ నెల 18న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉమ్మడి ఖమ్మం జిల్లాలో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొననున్నారు. ఉదయం అక్కడ పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేయడంతోపాటు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశంలో ఆయన పాల్గొంటున్నారు. అనంతరం సీపీఐ 100 సంవత్సరాల వేడుకలకు హాజరుకానున్నారు. పనులన్నీ త్వరితగతిన ముగించుకొని సాయంత్రం 5 గంటల లోపు సీఎం మేడారం చేరుకోనున్నారు.

**అక్కడే బస..**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితోపాటు సహచర మంత్రివర్గంలోని చాలామంది మేడారంలోనే బస చేయనున్నారు. మరుసటి రోజు జనవరి 19వ తేదీ ఉదయం ప్రభుత్వం రూ.251 కోట్లతో ప్రతిష్ఠాత్మకంగా నిర్మించిన అమ్మవార్ల నూతన ప్రాంగణంతోపాటు ఇతర అభివృద్ధి పనులను సీఎం ప్రారంభించనున్నారు. అనంతరం అమ్మవార్లను దర్శించుకొని మొక్కులు చెల్లించుకోనున్నారు. అనంతరం సీఎం హైదరాబాద్ కు చేరుకుంటారు. ఆ వెంటనే ఆయన ప్రతిష్ఠాత్మక వరల్డ్ ఎకనామిక్ ఫోరంలో పాల్గొనేందుకు దావోస్ బయలుదేరనున్నారు.

**విస్తృత ఏర్పాట్లు..**

ముఖ్యమంత్రితోపాటు రాష్ట్ర మంత్రులంతా మేడారం తరలిరానున్న నేపథ్యంలో ములుగు జిల్లా యంత్రాంగం విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే మేడారం జాతరకు భక్తులు అధిక సంఖ్యలో తరలివస్తున్న నేపథ్యంలో అక్కడే మంత్రివర్గ సమావేశం నిర్వహించడం అధికారులకు కత్తిమీద సాములా మారింది. ట్రాఫిక్ అంతరాయాలు లేకుండా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేస్తున్నారు. అదే విధంగా సీఎంతోపాటు ఇతర మంత్రులెవరికీ ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు చేస్తున్నారు. పంచాయతీ రాజ్ శాఖ మంత్రి సీతక్కతోపాటు జిల్లా కలెక్టర్ టీఎస్.దివాకర, ఎస్పీ రాంనాథ్ కేకన్ అక్కడే మకాం వేసి ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు.






## పరిశుభ్రతే దైవత్వం..

- మేడారం జాతరను ఆదర్శంగా నిలుపుదాం
- కలెక్టర్ దివాకర టీఎస్

**వరంగల్ వాయిస్, ములుగు :** 'పరిశుభ్రమైన చేతులు.. స్వచ్ఛమైన మనసు కలిసినప్పుడే ఆరోగ్యవంతమైన, ఆనందమయ సమాజం సాధ్యమవుతుంద'ని ములుగు జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ పేర్కొన్నారు. శుభ్రతే దైవత్వమని, పరిశుభ్ర జీవనం ప్రతి ఒక్కరి కనీస బాధ్యత అని ఆయన స్పష్టం చేశారు. రానున్న మేడారం సమ్మక్క–సారలమ్మ జాతర వంటి మహత్తర ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో పరిశుభ్ర వాతావరణం అత్యంత కీలకమని కలెక్టర్ తెలిపారు. పరిసరాలు అద్దంలా ఉన్నప్పుడే భక్తుల విశ్వాసం, ఆధ్యాత్మిక ఆనందం రెట్టింపు అవుతాయని ఆయన పేర్కొన్నారు. భక్తులందరూ తమ చుట్టూ ఉన్న మురికిని తొలగిస్తూ, పరిశుభ్రతను ఒక అలవాటుగా కాకుండా ఒక జీవనశైలిగా స్వీకరించాలని పిలుపునిచ్చారు. పరిశుభ్రత అనేది కేవలం బయటి పరిసరాలకే పరిమితం కాకూడదని, అది మన ఆలోచనలు, చర్యలు, ప్రవర్తనలో కూడా ప్రతిబింబించాలని కలెక్టర్ సూచించారు. 'శుభ్రమైన ఆలోచన, సక్రమమైన చర్య, చిరునవ్వుతో కూడిన జీవితం ప్రతి ఒక్కరికీ మేలు చేస్తాయి.. పవిత్రమైన జీవనమే మనల్ని దైవత్వానికి దగ్గర చేస్తుంది' అని ఆయన వివరించారు. మేడారం జాతర నిర్వహణలో భక్తులందరూ ఒక ఉద్యమంలా భాగస్వాములు కావాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. అందరూ కలిసికట్టుగా కృషి చేసి, మేడారం జాతరను ఆరోగ్యవంతమైన, పరిశుభ్రమైన జాతరగా దేశానికే ఆదర్శంగా నిలపాలని ఆయన కోరారు.

## ఒకే ఇంట్లో ముగ్గురికి 'సర్కారీ' కొలువులు

### ఆదర్శంగా నిలుస్తున్న అక్కాచెల్లెళ్లు

**వరంగల్ వాయిస్, కాజీపేట :** నేటి పోటీ ప్రపంచంలో ఒక్క ప్రభుత్వ ఉద్యోగం సాధించడమే గగనమైన వేళ, ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు అక్కాచెల్లెళ్లు ప్రభుత్వ కొలువులు సాధించి అందరినీ అబ్బురపరుస్తున్నారు. హనుమకొండ జిల్లా కాజిపేట మండలం కుమ్మరిగూడెం గ్రామానికి చెందిన మాకుల నర్సయ్య – లక్ష్మి దంపతుల కుమార్తెలు ఈ అరుదైన ఘనత సాధించి తమ గ్రామానికి గర్వకారణంగా నిలిచారు. నలుగురు కుమార్తెలు ఉన్న ఈ కుటుంబంలో ముగ్గురు ప్రభుత్వ ఉద్యోగాల్లో స్థిరపడ్డారు. రెండవ కుమార్తె మాకుల శ్రీలత రెవెన్యూ విభాగంలో సీనియర్ అసిస్టెంట్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. మూడో కుమార్తె మాకుల శ్వేత తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలలో పీజీటీగా పనిచేస్తున్నారు. చివరి కుమార్తె మాకుల సృజన ఇటీవల జరిగిన నియామకాల్లో ల్యాబ్ టెక్నీషియన్‌గా ఎంపికై తన అక్కల బాటలోనే ప్రభుత్వ ఉద్యోగం సాధించారు. పెద్ద కుమార్తె రజిని గతంలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేసి ప్రస్తుతం గృహిణిగా స్థిరపడ్డారు.

**తల్లిదండ్రుల కష్టం.. భర్తల ప్రోత్సాహం**

తమ విజయంపై సోదరీమణులు స్పందిస్తూ.. 'మా తల్లిదండ్రుల దీవెనలు, కష్టపడే తత్వమే మమ్మల్ని ఈ స్థాయికి చేర్చాయి. వివాహం తర్వాత కూడా మా భర్తలు అందించిన ప్రోత్సాహం, సహకారంతో మేము చదువుపై దృష్టి పెట్టి ఈ ఉద్యోగాలు సాధించగలిగాము' అని సంతోషం వ్యక్తం చేశారు. ఆడపిల్లలను చదివిస్తే వారు కుటుంబానికే కాకుండా సమాజానికి కూడా గర్వకారణంగా నిలుస్తారని పలువురు కొనియాడుతున్నారు.

# వరద ప్రాంతాల్లో కేంద్ర బృందం పర్యటన

- దెబ్బతిన్న పంటలు, రోడ్లు, ఇండ్ల పరిశీలన



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** మొంథా తుపాన్ ప్రభావంతో అక్టోబర్ నెలలో కురిసిన భారీ వర్షాల కారణంగా హనుమకొండ జిల్లాలో వరద ముంపు, కోతకు గురైన రోడ్లు, కూలిన ఇండ్లను కేంద్ర అధికారుల బృందం శుక్రవారం పరిశీలించారు. జిల్లాలోని వరద ప్రభావిత ప్రాంతాలలో జరిగిన పంట నష్టం, రోడ్లు, విద్యుత్, ఇండ్ల నష్టంపై అంచనా వేసేందుకు క్షేత్రస్థాయిలో కేంద్ర బృందం పర్యటించింది. ముందుగా ధర్మసాగర్ మండలం దేవునూరు గ్రామ ప్రధాన రహదారి వరద ధాటికి దెబ్బతిన్న రోడ్డును కేంద్ర అధికారుల బృందం, జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ తో కలిసి పరిశీలించారు. గ్రామంలో దెబ్బతిన్న పంటల వివరాలను రైతులు, స్థానికులను కేంద్ర అధికారుల బృందం ప్రతినిధులు అడిగి తెలుసుకున్నారు. రైతులు స్థానికులతో మాట్లాడి ఏయే పంటలకు ఎంత నష్టం వాటిల్లింది, ఎంత మేరకు రోడ్లు దెబ్బతిన్నాయనే వివరాలను సంబంధిత శాఖల అధికారులను, స్థానికులను అధికారుల బృందం అడిగి తెలుసుకున్నారు. వరద ధాటికి దెబ్బతిన్న రోడ్లు, పంట పొలాలకు సంబంధించిన ఛాయా చిత్ర ప్రదర్శనను కేంద్ర బృందం పరిశీలించింది. దేవునూరు నుంచి ముప్పారం గ్రామం మధ్యలో ఉన్న లో–లెవెల్ బ్రిడ్జి సమీపంలో పంట నష్టం జరిగిన ప్రాంతాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ముప్పారం గ్రామంలో భారీ వర్షాల కారణంగా తోట కమలమ్మకు చెందిన ఇల్లు కూలిపోగా ఆ ఇంటిని పరిశీలించి ఆ మహిళతో మాట్లాడారు. గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఉన్న హనుమకొండ సమ్మయ్య నగర్, గోపాల్ పూర్ ఊర చెరువు కట్ట, వరద ముంపునకు గురైన అమరావతి నగర్ ప్రాంతాలను జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్, జీడబ్ల్యూఎంసీ కమిషనర్ చాహత్ బాజ్ పాయ్ లతో కలిసి కేంద్ర అధికారుల బృందం పరిశీలించారు. ఈ సందర్భంగా కేంద్ర అధికారుల బృందం వెంట జిల్లా అదనపు కలెక్టర్ ఎన్.రవి, హనుమకొండ ఆర్డీఓ రాథోడ్ రమేష్, జిల్లా వ్యవసాయ అధికారి రవీందర్ సింగ్, పంచాయతీ రాజ్ ఈఈ ఆత్మారామ్, విద్యుత్ శాఖ ఎస్ఈ మధుసూదన్, ఆర్ అండ్ బి అధికారులు గోపికృష్ణ, ఉదయ్, ఇతర శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# మహిళల భాగస్వామ్యంతోనే సమాజ వికాసం



● షీ టీం ఎస్సై స్వాతి

**వరంగల్ వాయిస్, నర్సంపేట :** మహిళలు కేవలం గృహానికే పరిమితం కాకుండా అన్ని రంగాల్లో చురుకుగా పాల్గొన్నప్పుడే సమాజం సంపూర్ణంగా అభివృద్ధి చెందుతుందని నర్సంపేట షీ టీం ఎస్సై స్వాతి పేర్కొన్నారు. మహేశ్వరం గ్రామంలో అరుణోదయ యూత్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ముగ్గుల పోటీల కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మహేశ్వరం గ్రామానికి చెందిన 2010-11 పదవ తరగతి పూర్వ విద్యార్థులు, తమ దివంగత మిత్రుడు శశిప్రీతం జ్ఞాపకార్థం ఈ పోటీలను ఏర్పాటు చేశారు. చిన్ననాటి మిత్రుడిని స్మరించుకుంటూ గ్రామంలో ఇటువంటి ఉత్సాహభరితమైన కార్యక్రమాన్ని నిర్వహించడం అభినందనీయమని అతిథులు కొనియాడారు. ఈ సందర్భంగా ఎస్సై స్వాతి మహిళలను ఉద్దేశించి మాట్లాడుతూ.. మహిళలు ధైర్యంగా ముందడుగు వేయాలని, ఏవైనా సమస్యలు ఎదురైతే దీటుగా పోరాడాలని పిలుపునిచ్చారు. చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని సూచిస్తూ, 'షీ టీం' పనితీరు, మహిళా రక్షణ కోసం పోలీసులు తీసుకుంటున్న చర్యల గురించి వివరించారు. అనంతరం ముగ్గుల పోటీల్లో ప్రతిభ కనబరిచిన విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ప్రధానోపాధ్యాయులు మోర్తాల గోపాల్ రావు, శశిప్రీతం కుటుంబ సభ్యులు కొయ్యడ విజయ, జనప్రియ, సంతోష్‌లతో పాటు ఉపాధ్యాయులు పెండ్యాల పురుషోత్తం, ఆకారపు కృష్ణమూర్తి, జినుకల నర్సింహారాములు, పోరెడ్డి నర్సిరెడ్డి, మాడుగుల రాజిరెడ్డి, బాబు, పురపాలక సంఘ సిబ్బంది, న్యాయ నిర్ణేతలు, మిత్ర బృందం పాల్గొన్నారు.

# అలరించిన ముగ్గుల పోటీలు



**వరంగల్ వాయిస్, జనగామ :** సంక్రాంతి సంబరాల్లో భాగంగా జనగామ పట్టణంలోని వీవర్స్ కాలనీలో శుక్రవారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు ఘనంగా నిర్వహించారు. వార్డు అధ్యక్షులు వంగ యుగేందర్, యూత్ అధ్యక్షుడు బత్తిని వెంకటేష్ నేతృత్వంలో స్థానిక ఆంజనేయ స్వామి ఆలయ ప్రాంగణంలో జరిగిన ఈ పోటీలకు అనూహ్య స్పందన లభించింది. సుమారు 130 మంది మహిళలు, బాలికలు పోటీల్లో పాల్గొని రంగురంగుల ముగ్గులతో కాలనీని ముస్తాబు చేశారు.రాష్ట్ర స్థాయి రంగోలి కళాకారిణి, గుర్రం జాషువా కళారత్న అవార్డు గ్రహీత పెద్ది కుసుమ ఈ పోటీలకు న్యాయ నిర్ణేతగా వ్యవహరించారు. ముగ్గుల నాణ్యత, కళాత్మకతను పరిశీలించి రెండు విభాగాల్లో విజేతలను ఎంపిక చేశారు. ఈ సందర్భంగా మాజీ మున్సిపల్ కౌన్సిలర్ బిట్ల పుష్ప పెద్ది కుసుమను ఘనంగా సన్మానించారు. పోటీలో ప్రతిభ కనబరిచిన విజేతలకు పార్టీ నాయకులు బహుమతులు అందజేశారు. ప్రథమ బహుమతి మండల స్రవంతి, ద్వితీయ బహుమతి విష్ణు ప్రసన్న, బేతి శ్రావణి,తృతీయ బహుమతి నందిని, అంకాల రాధిక, కుడికాలు లక్ష్మి శ్రీ అందుకున్నారు. కార్యక్రమంలో పాల్గొన్న వారందరికీ కాంగ్రెస్ నాయకులు శ్రీరామ్ శ్రీనివాస్, అనగందుల వెంకటేష్, బిర్రు నరేందర్, రచ్చ సత్యనారాయణ, సోషల్ వాయిస్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు మంగళంపల్లి రాజు బహుమతులు పంపిణీ చేశారు.

ఈ కార్యక్రమంలో కాలనీ పెద్దలు కాముని సమ్మయ్య, బొంతపల్లి నాగరాజు, కందగట్ల సోమనర్సయ్య, బిట్ల విజయ్, కొండా బాబు తదితరులు పాల్గొన్నారు.

# సంప్రదాయానికి ప్రతీకగా సంక్రాంతి సంబరాలు

**వరంగల్ వాయిస్, నడికూడ :** మండలంలోని పలు గ్రామాల్లో సంక్రాంతి పండుగ సంబరాలు అంబరాన్నంటాయి. రాయపర్తి గ్రామంలో న్యూ యువసేన యూత్ ఆధ్వర్యంలో గురువారం మహిళలకు నిర్వహించిన ముగ్గుల పోటీలు విశేషంగా ఆకట్టుకున్నాయి. గ్రామీణ జీవన విధానం, రైతుల ప్రాముఖ్యత, దేశభక్తి మరియు ఆధ్యాత్మికత ఉట్టిపడేలా మహిళలు వేసిన సందేశాత్మక ముగ్గులు చూపరులను మంత్రముగ్ధులను చేశాయి. ముఖ్య అతిథిగా విచ్చేసిన రాయపర్తి గ్రామానికి చెందిన ఆర్ఐ మార్త కృష్ణస్వామి పోటీలను ప్రారంభించి మాట్లాడారు. ముగ్గులు మన ప్రాచీన జీవన విధానానికి, భారతీయ సంప్రదాయాలకు ప్రతీకలని ఆయన పేర్కొన్నారు. భావితరాలకు మన సంస్కృతి, ఆచారాలను





అందించాల్సిన బాధ్యత యువతపై ఉందని, ఇటువంటి కార్యక్రమాలు చేపట్టిన యువసేన యూత్ సభ్యులను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. పోటీల అనంతరం నిర్వాహకులు మార్త తిరుమలేష్, పరమేష్, రాజశేఖర్ తదితరుల ఆధ్వర్యంలో విజేతలకు బహుమతులు అందజేశారు. ప్రథమ బహుమతి మార్త నదియ, ద్వితీయ బహుమతి పానుగంటి అఖిల, తృతీయ బహుమతి గంపల పల్లి రచన, కాల్వ మానస, మేదరి ప్రసన్నలక్ష్మిలు గెలుపొందారు. అనంతరం చిన్నారులు నిర్వహించిన ఆటపాటలు జాతరను తలపించాయి. ఈ కార్యక్రమంలో యువసేన యూత్ సభ్యులు మార్త నందం, చిరంజీవి, మేదరి రాజశేఖర్, గ్రామంలోని మహిళలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# సమ్మక్క-సారలమ్మలకు నిలువెత్తు 'బంగారం'

## మొక్కు తీర్చుకున్న జర్నలిస్ట్ దంపతులు



**వరంగల్ వాయిస్, రఘునాథపల్లి :** మేడారం సమ్మక్క-సారలమ్మ అమ్మవార్లకు భక్తులు తమ భక్తిని చాటుకుంటున్నారు. శుక్రవారం సీనియర్ జర్నలిస్టు చింతకింది కృష్ణమూర్తి - రాజేశ్వరి దంపతులు అమ్మవార్లను దర్శించుకుని, తమ నిలువెత్తు బంగారాన్ని (బెల్లం) మొక్కుగా సమర్పించారు. గత మేడారం జాతర సమయంలో అమ్మవార్లకు నిలువెత్తు బంగారం సమర్పించుకుంటామని ఈ దంపతులు మొక్కుకున్నారు. ఆ మొక్కులో భాగంగానే నేడు మేడారం చేరుకుని గద్దెలపై తల్లులకు బెల్లాన్ని నివేదించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తమ కుటుంబంతో పాటు రాష్ట్ర ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని, అమ్మవార్ల దీవెనలు అందరిపై ఉండాలని వేడుకున్నట్లు తెలిపారు. వనదేవతల దర్శనం కోసం వచ్చిన భక్తులతో మేడారం పరిసర ప్రాంతాలు ఆధ్యాత్మిక శోభతో కళకళలాడుతున్నాయి. వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# జర్నలిస్టుల అరెస్టు అమానుషం

## తాటిపాముల వెంకట్రాములు



**వరంగల్ వాయిస్, హైదరాబాద్:** ఎన్టీవీ ఇన్ పుట్ ఎడిటర్ దొంతు రమేష్, రిపోర్టర్లు పరిపూర్ణాచారి, సుధీర్‌లను పోలీసులు అక్రమంగా అరెస్టు చేసి నిర్బంధించడాన్ని భారతీయ ఖేత్ మజ్దూర్ యూనియన్ జాతీయ కార్యవర్గ సభ్యుడు తాటిపాముల వెంకట్రాములు తీవ్రంగా ఖండించారు. జర్నలిస్టుల పట్ల ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలకు దిగడం దుర్మార్గమని ఆయన మండిపడ్డారు. వివాదాస్పద కథనం పేరుతో, కుటుంబంతో కలిసి విహారయాత్రకు వెళ్తున్న దొంతు రమేష్‌ను శంషాబాద్ ఎయిర్‌పోర్టులో, మిగిలిన వారిని అర్ధరాత్రి పూట వారి నివాసాల్లో క్రిమినల్ నేరస్తుల వలె అరెస్టు చేయడం అత్యంత దారుణమని ఆయన పేర్కొన్నారు. కనీసం నోటీసులు కూడా ఇవ్వకుండా, పండుగ పూట కుటుంబ సభ్యులను భయభ్రాంతులకు గురి చేస్తూ ఇలాంటి దాడులకు పాల్పడటం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని ఆగ్రహం వ్యక్తం చేశారు. "ప్రజాస్వామ్యానికి నాలుగో స్తంభమైన జర్నలిజంపై దాడి చేయడం అంటే ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడమే" అని వెంకట్రాములు వ్యాఖ్యానించారు. ప్రభుత్వం తక్షణమే మీడియా గొంతు నొక్కే ప్రయత్నాలను విరమించుకోవాలని, అరెస్టయిన జర్నలిస్టులను బేషరతుగా విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

# ఐనవోలు మల్లన్నను దర్శించుకున్న ఎంపీ ఈటల రాజేందర్



**వరంగల్ వాయిస్, ఐనవోలు:** దక్షిణ కాశీగా పేరుగాంచిన ఐనవోలు శ్రీ మల్లికార్జున స్వామి వారి బ్రహ్మోత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని మల్కాజ్‌గిరి పార్లమెంట్ సభ్యులు, బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యులు ఈటల రాజేందర్ స్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు ఆయనకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఈటల రాజేందర్ స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం జాతర ప్రాంగణాన్ని కలియతిరిగి, భక్తుల కోసం ఏర్పాటు చేసిన సౌకర్యాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రజలందరికీ మల్లన్న ఆశీస్సులు ఉండాలని, అందరూ సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఈటలతో పాటు మాజీ ఎమ్మెల్యేలు ఆరూరి రమేష్, కొండేటి శ్రీధర్, రాజేశ్వరరావు, ధర్మారం, బీజేపీ రాష్ట్ర నాయకులు ఎర్రబెల్లి ప్రదీప్ రావు, తిరుపతి రెడ్డి తదితరులు పాల్గొన్నారు. జాతరలో పాల్గొన్న ప్రముఖులను బీజేపీ పర్వతగిరి ఉపాధ్యక్షుడు తొర్రి లక్ష్మణ్ యాదవ్ ప్రత్యేకంగా కలిసి, శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో మండల స్థాయి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# కార్పొరేట్లకు దేశ సంపద కట్టబెడుతున్న మోడీ

## ◆ నల్లజెండాలతో ఎస్కేఎం నిరసన




**వరంగల్ వాయిస్, వరంగల్ :** కేంద్రంలోని మోడీ ప్రభుత్వం పేద, మధ్యతరగతి ప్రజల ఉపాధిని కొల్లగొట్టి, దేశ సంపదను కార్పొరేట్ శక్తులకు ధారాదత్తం చేస్తోందని సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్కేఎం) రాష్ట్ర కన్వీనర్ పెద్దారపు రమేష్ మండిపడ్డారు. శనివారం ఎస్కేఎం దేశవ్యాప్త పిలుపులో భాగంగా వరంగల్ హెడ్ పోస్ట్ ఆఫీస్ సెంటర్లో రైతు, కార్మిక సంఘాల ఆధ్వర్యంలో నల్లజెండాలు, ప్లేకార్డులతో భారీ నిరసన, రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కన్వీనర్ కుసుంబా బాబురావు అధ్యక్షతన జరిగిన సభలో నాయకులు మాట్లాడుతూ.. ఎన్నో పోరాటాలతో సాధించుకున్న 29 కార్మిక చట్టాలను రద్దు చేసి, కార్మికులను బానిసలుగా మార్చేందుకు కేంద్రం కుట్ర చేస్తోందని ఆరోపించారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకానికి నిధులు తగ్గించి, ఆ పథకాన్ని నిర్వీర్యం చేయడం అమానుషమని ధ్వజమెత్తారు. నూతన విద్యుత్, విత్తన చట్టాల పేరుతో వ్యవసాయ రంగాన్ని ప్రైవేటు కంపెనీలకు అప్పగిస్తున్నారని నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. స్వదేశీ నినాదంతో అధికారంలోకి వచ్చి, విదేశీ పెట్టుబడిదారులకు ఊడిగం చేస్తున్నారని విమర్శించారు. కేంద్రం వెంటనే తన మొండి వైఖరిని వీడాలని, లేనిపక్షంలో దేశవ్యాప్తంగా ఉద్యమాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని యధావిధిగా కొనసాగించాలి. రద్దు చేసిన 29 కార్మిక చట్టాలను వెంటనే పునరుద్ధరించాలి. నూతన విత్తన చట్టాన్ని సవరించి, కేంద్ర విద్యుత్ చట్టాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్కేఎం జిల్లా కన్వీనర్లు సోమిడి శ్రీనివాస్, రాచర్ల బాలరాజు, చిర్ర సూరి, చుక్క మొగిలి, వల్లందాస్ కుమార్, కార్మిక సంఘాల నేతలు గన్నారపు రమేష్, ముక్కెర రామస్వామి, ఎలకంటి రాజేందర్, గంగుల దయాకర్, నర్ర ప్రతాప్, ఓదెల రాజన్న, రైతులు, కార్మికులు పాల్గొన్నారు.

# బాధిత కుటుంబానికి పరామర్శ



**వరంగల్ వాయిస్, నడికూడ :** మండలంలోని నర్సక్కపల్లి గ్రామానికి చెందిన ప్రముఖులు నాగూర్ల బాపూరావు ఇటీవల మృతి చెందారు. విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ రాష్ట్ర సీనియర్ నాయకులు నాగూర్ల వెంకటేశ్వర్లు శుక్రవారం నర్సక్కపల్లిని సందర్శించారు. స్వర్గీయ బాపూరావు పార్థివ దేహానికి పూలమాల వేసి వెంకటేశ్వర్లు ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి, తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. బాపూరావు మృతి ఆ కుటుంబానికి తీరని లోటని, వారి ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షించారు. బాపూరావు కుటుంబానికి పార్టీ తరపున, వ్యక్తిగతంగా ఎల్లప్పుడూ అండగా ఉంటామని ఆయన భరోసా ఇచ్చారు. ఏ కష్టం వచ్చినా తమ వంతు సహాయం అందిస్తామని కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్, ఉప సర్పంచ్, వార్డు సభ్యులతో పాటు బీఆర్ఎస్ నాయకులు, రైతులు, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని బాపూరావుకు నివాళులర్పించారు.

# దుబ్బపేటలో జాతర ఏర్పాట్లు



**వరంగల్ వాయిస్, మల్హర్ (వరంగల్ వాయిస్):** రానున్న సమ్మక్క–సారలమ్మ జాతరను పురస్కరించుకొని భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ ఆదేశించారు. ఈ మేరకు శుక్రవారం మల్హర్ మండలంలోని దుబ్బపేట గ్రామంలో వెలిసిన సమ్మక్క–సారక్క గద్దెలను తహసీల్దార్ రవి కుమార్ సందర్శించి, క్షేత్రస్థాయిలో ఏర్పాట్లను పరిశీలించారు. జాతర నిర్వహణపై తహసీల్దార్ నిర్వాహకులకు, అధికారులకు పలు కీలక సూచనలు చేశారు. ప్రధానంగా బీటీ రోడ్డు నుంచి అమ్మవార్ల గద్దెల వరకు భక్తుల రాకపోకలకు వీలుగా తాత్కాలిక రహదారిని నిర్మించాలని ఆదేశించారు. అలాగే జాతర ప్రాంతంలో నిరంతర విద్యుత్ సరఫరా ఉండేలా చూడాలి. భక్తుల దాహార్తిని తీర్చడానికి సరిపడా త్రాగునీటి వసతి కల్పించాలి. పారిశుధ్య లోపం లేకుండా తగినన్ని తాత్కాలిక మరుగుదొడ్లను ఏర్పాటు చేయాలని సూచించారు. అమ్మవార్ల దర్శనానికి వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని శాఖల సమన్వయంతో ఏర్పాట్లు పూర్తి చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో మండల రెవెన్యూ సిబ్బంది, జాతర నిర్వహణ కమిటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# అంబరాన్నంటిన సంక్రాంతి సంబరాలు



**వరంగల్ వాయిస్, డోర్నకల్ :** తెలుగువారి పెద్ద పండుగ 'మకర సంక్రాంతి' వేడుకలు డోర్నకల్ నియోజకవర్గవ్యాప్తంగా అత్యంత శోభాయమానంగా జరిగాయి. ప్రకృతి రమణీయతకు, పాడిపంటలకు ప్రతీకగా నిలిచే ఈ పండుగను ప్రజలు తమ కుటుంబ సభ్యులతో కలిసి ఆనందోత్సాహాల మధ్య జరుపుకున్నారు. పండుగను పురస్కరించుకొని మహిళలు తెల్లవారుజామునే లేచి తమ ఇళ్ల ముందు రంగురంగుల ముగ్గులు వేసి, గొబ్బెమ్మలతో అలంకరించారు. "హరిలో రంగ హరి" అంటూ హరిదాసులు కీర్తనలు పాడుతూ గ్రామంలో సంచరించగా, ప్రజలు వారికి ధాన్యాన్ని సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. డోలక్ దరువులకు అనుగుణంగా గంగిరెద్దులు చేసిన విన్యాసాలు గ్రామస్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. మరోవైపు యువత గాలిపటాలు ఎగురవేస్తూ సందడి చేశారు. ఉత్తరాయణ పుణ్యకాలాన్ని పురస్కరించుకొని స్థానిక ఆలయాల్లో భక్తుల రద్దీ నెలకొంది. పవిత్ర స్నానాలు ఆచరించిన అనంతరం భక్తులు ప్రత్యేక వ్రతాలు, పూజా కార్యక్రమాలు నిర్వహించారు. పల్లెటూళ్లన్నీ కొత్త అల్లుళ్లు, బంధుమిత్రులతో కళకళలాడుతూ పండుగ వాతావరణాన్ని ప్రతిబింబించాయి.

# క్రికెట్ మైదానంలో 'ఫ్రెండ్స్ ఫరెవర్' జోరు

## 'ఏపీఎల్' విజేతగా నిలిచిన జట్టు




**వరంగల్ వాయిస్, ఆత్మకూరు :** శ్రీ మేధ వి జూనియర్ కాలేజీ, లిటిల్ మేధ స్కూల్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన 'ఆత్మకూర్ మండల స్థాయి ప్రీమియర్ లీగ్' సర్కిల్ క్రికెట్ టోర్నమెంట్ శుక్రవారం అత్యంత ఉత్సాహభరితంగా ముగిసింది. స్థానిక యువతలోని క్రీడా ప్రతిభను వెలికితీసేందుకు నిర్వహించిన ఈ పోటీలు క్రీడాకారుల పోరాటపటిమతో అలరించాయి. టోర్నమెంట్ ఆద్యంతం ఉత్కంఠగా సాగగా, ఫైనల్స్ లో 'ఫ్రెండ్స్ ఫరెవర్'– 'శివసేన' జట్లు తలపడ్డాయి. మైదానంలో అద్భుత ప్రదర్శన కనబరిచిన 'ఫ్రెండ్స్ ఫరెవర్' జట్టు విజేతగా నిలిచి ట్రోఫీని కైవసం చేసుకుంది. కడవరకు గట్టి పోటీ ఇచ్చిన 'శివసేన' జట్టు రన్నరప్ తో సరిపెట్టుకుంది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సర్పంచ్ పర్వతగిరి మహేశ్వరి రాజు మాట్లాడుతూ.. మానసిక ఉల్లాసానికి, శారీరక దృఢత్వానికి క్రీడలు ఎంతగానో తోడ్పడతాయని కొనియాడారు. అనంతరం విద్యాసంస్థల డైరెక్టర్ కందగట్ల నరేంద్ర మాట్లాడుతూ.. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని, గెలుపోటములను సమానంగా స్వీకరించే క్రీడా స్ఫూర్తిని అలవరచుకోవాలని సూచించారు. విజేతలకు బహుమతులు అందజేసిన వారిలో సర్పంచ్‌తో పాటు పావని రవి, వార్డు సభ్యులు కొంపెల్లి రవి, మాజీ పిఎసిఎస్ డైరెక్టర్ జయపాల్ రెడ్డి ఉన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీ మేధ విద్యాసంస్థల సిబ్బంది, స్థానిక ప్రజలు, క్రీడాకారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# కనువిందు చేసిన ముగ్గుల పోటీలు



**వరంగల్ వాయిస్, సంగెం :** సంక్రాంతి పండుగను పురస్కరించుకొని సంగెం మండలంలోని ఎలుగూర్ రంగంపేట గ్రామంలో దిక్సూచి ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన ముగ్గుల పోటీలు సందడిగా సాగాయి. గ్రామంలోని ఆడపడుచులు, యువతులు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ ప్రతిభను చాటారు. సంక్రాంతి శోభ ఉట్టిపడేలా రంగురంగుల ముగ్గులు వేసి గ్రామాన్ని ముస్తాబు చేశారు. పోటీల్లో ప్రతిభ కనబరిచిన విజేతలను న్యాయ నిర్ణేతలు ఎంపిక చేశారు. వీరికి వల్లెపు చంద్రశేఖర్ అందజేసిన బహుమతులను గ్రామ సర్పంచ్ బెజ్జంకి శేషాద్రి చేతుల మీదుగా పంపిణీ చేశారు. ప్రథమ బహుమతి పోతుల భాను శ్రీ, ద్వితీయ బహుమతి బత్తుల శివరాణి, తృతీయ బహుమతి షాబోతు మౌనికలు అందుకున్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. మన సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవడంలో మహిళల పాత్ర కీలకమన్నారు. పండుగ వేళ ఇలాంటి పోటీలు నిర్వహించడం వల్ల గ్రామంలో ఉత్సాహభరిత వాతావరణం నెలకొందని, ముగ్గుల పోటీలు నిర్వహించిన దిక్సూచి ఫౌండేషన్ సభ్యులను ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో దిక్సూచి ఫౌండేషన్ ప్రతినిధులు బందెల మల్లేష్, బోనాల నాగార్జున, దేవ రాజగోపాల్, అనుమాన్ల బాలకృష్ణ, రాజారామ్, బెజ్జంకి రాజేష్, మాదూరి సురేష్, బోనాల రమేష్, ఉప సర్పంచ్ పెద్దగోని శ్వేత నరేష్, మాజీ సర్పంచ్ జనగాం రమేష్, గ్రామస్తులు పాల్గొన్నారు.

# మానసిక ఉల్లాసానికి క్రీడలే ప్రాణం

## • సర్పంచ్ మహేశ్వరి-రాజు



**వరంగల్ వాయిస్, ఆత్మకూరు :** మానసిక ప్రశాంతతకు, శారీరక దృఢత్వానికి క్రీడలు ఎంతగానో దోహదపడతాయని ఆత్మకూరు సర్పంచ్ పర్వతగిరి మహేశ్వరి రాజు అన్నారు. భోగి, సంక్రాంతి, కనుమ పండుగలను పురస్కరించుకొని శుక్రవారం ఆత్మకూరు మండల కేంద్రంలో గ్రామ స్థాయి క్రీడా పోటీలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. హనుమకొండ డీసీసీ అధ్యక్షుడు ఇనగాల వెంకట్రామ్ రెడ్డి, పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి అందిస్తున్న ప్రోత్సాహంతో గ్రామంలో కబడ్డీ, వాలీబాల్ పోటీలు నిర్వహించినట్లు తెలిపారు. వీరి సహకారంతో గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి, ఆదర్శంగా తీర్చిదిద్దుతానని ఆమె పేర్కొన్నారు. అనంతరం వాలీబాల్, కబడ్డీ పోటీల్లో విజేతలుగా నిలిచిన కుక్కల రమేష్, రజినీకాంత్ బృందాలను ప్రత్యేకంగా అభినందించి, వారికి బహుమతులు అందజేశారు. క్రీడల ద్వారా యువతలో ఐకమత్యం పెరుగుతుందని, క్రమశిక్షణ అలవడుతుందని నాయకులు అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో ఆత్మకూరు గ్రామ పార్టీ అధ్యక్షుడు బయ్యా కుమార్, మండల యూత్ అధ్యక్షుడు తనుగుల సందీప్, మండల పార్టీ ప్రధాన కార్యదర్శి గుండెబోయిన శ్యామ్ పాల్గొన్నారు. అలాగే కాంగ్రెస్ నాయకులు సుగ్రీవ్, యూత్ నాయకులు వీరేందర్, నవీన్, రోహిత్, మణికంఠ, రజినీకాంత్, కక్కు శ్రీకాంత్ తదితరులు పాల్గొని క్రీడాకారులను ఉత్సాహపరిచారు

WARANGALVOICE
www.epaper.warangalvoice.net
www.warangalvoice.net

వరంగల్ వాయిస్ Evening Daily

GRATER WARANGAL
Hanamkonda | Mahabubabad | Jangaon | Dornakal
Bhupalapaly | Mulugu | Parakala | Narsampet
Station Ghanpur | Palakurthy | Waradannapet

శుక్రవారం, జనవరి 16, 2026

# మున్సిపల్ ఎన్నికలకు సన్నద్ధం కావాలి

● జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్



**వరంగల్ వాయిస్, జనగామ :** జిల్లాలో త్వరలో జరగనున్న మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు అధికారులు అన్ని ఏర్పాట్లను పక్కాగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో మున్సిపల్ రిజర్వేషన్ ప్రక్రియపై సంబంధిత అధికారులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. మున్సిపాలిటీల్లో వార్డుల రిజర్వేషన్ ఖరారు చేసేటప్పుడు ప్రభుత్వం విడుదల చేసిన నోటిఫికేషన్‌లోని మార్గదర్శకాలను ఖచ్చితంగా పాటించాలని సూచించారు. ఏ వర్గానికి కేటాయించాల్సిన సీట్లను ఆ వర్గానికి నిబంధనల ప్రకారం కేటాయించాలన్నారు. రిజర్వేషన్ల ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని స్పష్టం చేశారు. స్థానిక సంస్థల ఎన్నికలను అత్యంత పారదర్శకంగా, నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ సూచించారు. క్షేత్రస్థాయిలో ఓటర్ల జాబితా నుంచి పోలింగ్ కేంద్రాల ఏర్పాటు వరకు ప్రతి అంశంలోనూ అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ సమావేశంలో ఆర్డీవోలు, మున్సిపల్ కమిషనర్లు, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

## మైనారిటీ సీట్లను సద్వినియోగం చేసుకోవాలి ..

రాష్ట్ర ప్రభుత్వం మైనారిటీ విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన రెసిడెన్షియల్ (గురుకుల) పాఠశాలలు, కళాశాలల్లోని ప్రవేశాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా



షేక్ పిలుపునిచ్చారు. శుక్రవారం కలెక్టరేట్‌లో మైనారిటీ అడ్మిషన్లకు సంబంధించిన గోడపత్రికను ఆయన అధికారులతో కలిసి విడుదల చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో జనగామలో బాలుర కోసం, స్టేషన్ ఘన్‌పూర్‌లో బాలికల కోసం ప్రత్యేకంగా మైనారిటీ రెసిడెన్షియల్ విద్యాసంస్థలు ఉన్నాయని తెలిపారు. ఈ సీట్లలో 80% మైనారిటీలకు, 20% నాన్-మైనారిటీలకు కేటాయించడం జరిగింది. 5వ తరగతిలో నూతన ప్రవేశాలతో పాటు 6వ తరగతి నుండి 9వ తరగతి వరకు ఖాళీగా ఉన్న (బ్యాక్‌లాగ్) సీట్లకు అడ్మిషన్లు లభిస్తాయి. కళాశాలలో ప్రథమ సంవత్సరం నూతన అడ్మిషన్లతో పాటు ద్వితీయ సంవత్సరంలో ఖాళీగా ఉన్న సీట్లకు దరఖాస్తు చేసుకోవచ్చు. గురుకులాల్లో ప్రవేశం పొందిన విద్యార్థులకు ప్రభుత్వం అన్ని వసతులను ఉచితంగా కల్పిస్తుందని కలెక్టర్ వివరించారు. నాణ్యమైన ఇంగ్లీష్ మీడియం బోధన, ఉచిత పాఠ్యపుస్తకాలు, నోట్ బుక్స్, యూనిఫామ్స్, షూస్, స్టేషనరీ అందజేయబడతాయి. విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధతో పాటు పౌష్టికాహారం, ఉచిత భోజన వసతి కల్పిస్తారు. కళాశాల విద్యార్థులకు ఇంటర్‌తో పాటు పోటీ పరీక్షలైన నీట్, జేఈఈలలో ప్రత్యేక కోచింగ్ సౌకర్యం కలదు. అత్యంత అనుభవం కలిగిన ఉపాధ్యాయులతో బోధన సాగుతుందని, మైనారిటీ తల్లిదండ్రులు తమ పిల్లలను ఈ పాఠశాలల్లో చేర్చి వారి భవిష్యత్తును తీర్చిదిద్దాలని కలెక్టర్ కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా మైనారిటీ వెల్ఫేర్ ఆఫీసర్ డాక్టర్ విక్రమ్ కుమార్, ప్రిన్సిపాల్స్ కే.కుమారస్వామి, పి.అనిల్ బాబు, అధ్యాపకులు తాయినాత్ సగీరా, పెట్లోజు సోమేశ్వరా చారి, రెహానా, వార్డెన్ సల్మాన్ తదితరులు పాల్గొన్నారు.

# వైభవంగా లక్ష్మీనరసింహా స్వామి జాతర



**వరంగల్ వాయిస్, దామెర :** భక్తుల కొంగుబంగారంగా, కోరిన కోర్కెలు తీర్చే దైవంగా వెలుగొందుతున్న హనుమకొండ జిల్లా దామెర మండలం ఊరుగొండ శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి వార్షిక జాతర ఉత్సవాలు గురువారం రాత్రి అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి. సంప్రదాయం ప్రకారం, స్వామివారి ఉత్సవ విగ్రహాలను ఏనుగు వాహనం (గజ వాహనం) పై ఊరేగింపుగా గుట్టపైకి చేర్చడంతో జాతర అధికారికంగా మొదలైంది. మంగళవాయిద్యాలు, భక్తుల జయజయధ్వానాల మధ్య స్వామివారు గిరిపైకి చేరుకున్నారు. ఈ ఘట్టాన్ని వీక్షించేందుకు భక్తులు భారీగా తరలివచ్చారు. జాతర ప్రారంభమైన మరుసటి రోజు శుక్రవారం ఉదయం నుంచే భక్తుల తాకిడి పెరిగింది. ఉమ్మడి వరంగల్ జిల్లా నలుమూలల నుండి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. గుట్ట పరిసరాలన్నీ భక్తుల కోలాహలంతో, ఆధ్యాత్మిక శోభతో కళకళలాడుతున్నాయి.

# ఉత్సాహంగా శ్రీపాద స్మారక పోటీలు



**వరంగల్ వాయిస్, మల్హర్ :** మండలంలోని కొయ్యూరు గ్రామంలో నిర్వహించిన శ్రీపాద స్మారక వాలీబాల్ టోర్నమెంట్ శుక్రవారంతో ముగిసింది. ఈ పోటీలలో ప్రతిభ కనబరిచిన విజేతలకు ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ అయిత ప్రకాష్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై బహుమతులు అందజేశారు. శ్రీపాద స్మారకార్థం నిర్వహించిన ఈ టోర్నీలో పలు జట్లు ఉత్సాహంగా పాల్గొన్నాయి. ఫైనల్ మ్యాచ్‌లో అత్యుత్తమ ప్రదర్శన కనబరిచిన అరెంధ జట్టు ప్రథమ బహుమతిని కైవసం చేసుకోగా, ఆతిథ్య కొయ్యూరు జట్టు ద్వితీయ బహుమతిని దక్కించుకుంది. విజేత జట్లకు నగదు బహుమతితో పాటు ట్రోఫీలను అతిథులు అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ అయిత కోమల రాజి రెడ్డి, కొయ్యూరు సర్పంచ్ కొండ రాజమ్మ, వల్లెంకుంట సర్పంచ్ బొమ్మ రజిత రమేష్ రెడ్డి పాల్గొన్నారు. అలాగే ఉప సర్పంచ్ లు లకావత్ సవేందర్, కటకం స్వప్న, నాయకులు గడ్డం పోచయ్య, కటకం శ్రీనివాస్, రాజేందర్, వెంకటేష్, మమత, మల్లారెడ్డి, బాపు రెడ్డి, శ్రీనివాస్ తదితరులు పాల్గొని క్రీడాకారులను ఉత్సాహపరిచారు.

# రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

## మరొకరికి తీవ్ర గాయాలు

**వరంగల్ వాయిస్, పర్వతగిరి:** అతివేగంగా వచ్చిన బైక్ ఎదురుగా వస్తున్న వాహనాన్ని ఢీకొట్టిన ఘటనలో ఒకరు అక్కడికక్కడే మృతి చెందగా, మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. ఈ విషాద ఘటన పర్వతగిరి మండలంలోని తురకల సోమవారం గ్రామ శివారులో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. గోపనపల్లి గ్రామానికి చెందిన నాంపల్లి అన్నయ్య (50) తన టీవీఎస్ ఎక్సెల్ (TS 24 J 5736) వాహనంపై అదే గ్రామానికి చెందిన నాంపల్లి భిక్షపతి (55) ని వెనుక కూర్చుండబెట్టుకుని బయలుదేరారు. తురకల సోమవారం ఊరు చివర ఉన్న మూలమలుపు వద్దకు రాగానే, ఏబీ తండాకు చెందిన మాలోతు కార్తీక్ తన గ్లామర్ బైక్ (TS 24 C 7807)ను అతివేగంగా, అజాగ్రత్తగా నడుపుతూ వచ్చి అన్నయ్య వాహనాన్ని బలంగా ఢీకొట్టారు.ఈ ఘోర ప్రమాదంలో అన్నయ్యకు తీవ్ర గాయాలు కావడంతో ఆయన ఘటనా స్థలంలోనే ప్రాణాలు విడిచారు. వెనుక కూర్చున్న భిక్షపతికి కుడి చేయి విరగడంతో పాటు, కంటికి, రెండు కాళ్లకు బలమైన గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. మృతుడి కుమారుడు నాంపల్లి నరేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పర్వతగిరి పోలీసులు మాలోతు కార్తీక్ పై కేసు నమోదు చేశారు. ప్రమాదానికి కారణమైన వాహనాన్ని స్వాధీనం చేసుకుని దర్యాప్తు జరుపుతున్నారు.

# ఆదర్శ పంచాయతీగా చిట్యాలను తీర్చిదిద్దాలి

## నంది అవార్డు గ్రహీత మిట్టపల్లి సురేందర్



**వరంగల్ వాయిస్, చిట్యాల :** చారిత్రక నేపథ్యం కలిగిన చిట్యాల గ్రామపంచాయతీని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తూ, జిల్లాలోనే ఆదర్శంగా తీర్చిదిద్దాలని ప్రముఖ సినీ గేయ రచయిత, నంది అవార్డు గ్రహీత మిట్టపల్లి సురేందర్ ఆకాంక్షించారు. శుక్రవారం చిట్యాల మండల కేంద్రంలో మిట్టపల్లి మిత్రమండలి వ్యవస్థాపకులు పుల్ల సతీష్ ఆధ్వర్యంలో నూతనంగా ఎన్నికైన పంచాయితీ పాలకవర్గానికి అభినందన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా చిట్యాల గ్రామ నూతన సర్పంచ్ తౌటం లక్ష్మి-అంతయ్య, ఉపసర్పంచ్ బుర్ర వెంకటేష్ మరియు వార్డు సభ్యులను మిట్టపల్లి సురేందర్ శాలువాలతో ఘనంగా సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రజలు ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా గ్రామాభివృద్ధికి నిరంతరం కృషి చేయాలని సూచించారు. అనంతరం చిట్యాల క్రీడా ప్రాంగణంలో జరుగుతున్న క్రికెట్ టోర్నమెంట్‌కు సురేందర్, సర్పంచ్ తౌటం లక్ష్మి-అంతయ్య, ఉపసర్పంచ్ బుర్ర వెంకటేష్ హాజరయ్యారు. క్రీడాకారులతో ముచ్చటించి, టాస్ వేసి పోటీలను ఉత్సాహంగా ప్రారంభించారు. క్రీడాకారులందరికీ ఆల్ ది బెస్ట్ చెబుతూ, క్రీడలు యువతలో ఐకమత్యాన్ని పెంచుతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు పుల్ల నిర్మల సతీష్, తౌటం నవీన్, చెర్ల చందు, మైదాం శ్రావ్య పాల్గొన్నారు. అలాగే మిట్టపల్లి మిత్రమండలి సభ్యులు గోల్కొండ బుచ్చన్న, అడ్వకేట్ కలకోట మహేందర్, సింగర్ ఈశ్వర్ ప్రసాద్, దేవన్న, జన్నే యుగేందర్, గురుకుంట్ల కిరణ్, పుల్ల సుమన్, రాయిని శ్రీకాంత్, మహేష్, పాల శంకర్, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# గ్రామ సర్పంచ్ చొరవ..

## అగ్రంపాడు 'మినీ మేడారం' రోడ్డుకు మహర్దశ

## జిల్లా కలెక్టర్ స్పందనతో చకచకా సాగుతున్న రహదారి పనులు



**వరంగల్ వాయిస్, దామెర :** 'మినీ మేడారం'గా పేరుగాంచిన అగ్రంపాడు సమ్మక్క-సారలమ్మ జాతరకు మార్గం సుగమమైంది. ఈ నెల 28 నుంచి ప్రారంభం కానున్న జాతరను దృష్టిలో ఉంచుకుని, భక్తుల రాకపోకలకు ఇబ్బంది లేకుండా తక్కల్లపాడు - అగ్రంపాడు మధ్య దెబ్బతిన్న రహదారికి మరమ్మతులు చేపట్టారు. జాతరకు వరంగల్, హన్మకొండ, కరీంనగర్ జిల్లాల నుండి దాదాపు పది లక్షల మంది భక్తులు తరలివచ్చే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో భక్తుల సౌకర్యార్థం లింకు రోడ్ల మరమ్మతులు చేపట్టాలని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి అధికారులను ఆదేశించారు. గత వర్షాకాలంలో తక్కల్లపాడు నుండి అగ్రంపాడు వెళ్లే రోడ్డు కంకర తేలి, గుంతలతో వాహనాల రాకపోకలకు వీలు లేకుండా తయారైంది. దీనిపై తక్కల్లపాడు గ్రామ సర్పంచ్ దాడి వసంత రమేష్ ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు. ఆయన స్వయంగా జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ ను కలిసి పరిస్థితిని వివరించి వినతి పత్రం సమర్పించారు. సర్పంచ్ వినతికి సానుకూలంగా స్పందించిన కలెక్టర్, వెంటనే పనులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. కలెక్టర్ ఆదేశాలతో రంగంలోకి దిగిన అధికారులు, రోడ్డుకు ఇరువైపులా విస్తరించిన ముళ్ల పొదలను తొలగించారు. రోడ్డుపై మొరాన్ని పోసి, చదును చేస్తూ వాహనాల రాకపోకలకు అనువుగా మారుస్తున్నారు. సర్పంచ్ చొరవతో రోడ్డుకు మోక్షం కలగడం పట్ల గ్రామ ప్రజలతో పాటు భక్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. త్వరలోనే పనులన్నీ పూర్తి చేసి జాతరకు సిద్ధం చేస్తామని అధికారులు తెలిపారు.

# మేడారంలో భక్తుల కోలాహలం

- భారీగా భక్తుల తాకిడి
- రాష్ట్ర నలుమూలల నుంచి తరలివస్తున్న జనం



























# ఎన్టీఆర్, ప్రశాంత్ నీల్ మూవీలో అనిల్ కపూర్



యంగ్ టైగర్ ఎన్టీఆర్ హీరోగా, పాన్ ఇండియా దర్శకుడు ప్రశాంత్ నీల్ తెరకెక్కిస్తున్న భారీ చిత్రం 'డ్రాగన్' ఇప్పటికే దేశవ్యాప్తంగా భారీ అంచనాలు పెంచుకుంటోంది. 'కేజీఎఫ్', 'సలార్' వంటి బ్లాక్‌బస్టర్ల తర్వాత ప్రశాంత్ నీల్ నుంచి వస్తున్న సినిమా కావడంతో ఈ ప్రాజెక్ట్‌పై సినీ వర్గాల్లో ప్రత్యేక ఆసక్తి నెలకొంది. తాజాగా ఈ సినిమాలో బాలీవుడ్ సీనియర్ స్టార్ అనిల్ కపూర్ భాగమవుతున్నారనే వార్తలు మరింత హీట్ పెంచుతున్నాయి. ఇప్పటికే 'యానిమల్' సినిమాలో రణబీర్ కపూర్ తండ్రిగా అనిల్ కపూర్ చేసిన పాత్రకు ప్రేక్షకుల నుంచి మంచి ప్రశంసలు దక్కాయి. వయసు పెరిగిన తర్వాత కూడా పవర్‌ఫుల్ క్యారెక్టర్లతో తన మార్క్ చూపిస్తున్న అనిల్, ఇప్పుడు 'డ్రాగన్'లో కూడా అంతే బలమైన పాత్రలో కనిపించబోతున్నారనే చర్చ నడుస్తోంది. ఐఎండీబీ మోస్ట్ యాంటిసిపేటెడ్ ఇండియన్ మూవీస్ జాబితాలో 'డ్రాగన్' చోటు దక్కిన విషయాన్ని పరోక్షంగా హైలైట్ చేస్తూ, ఈ ప్రాజెక్ట్‌పై తన ఆసక్తిని అనిల్ కపూర్ వ్యక్తం చేశారు. ప్రశాంత్ నీల్ సినిమాల్లో సీనియర్ నటుల పాత్రలకు ప్రత్యేక ప్రాధాన్యం ఉంటుందన్న విషయం తెలిసిందే. 'కేజీఎఫ్'లో సంజయ్ దత్‌ను భీకరమైన విలన్‌గా చూపించి కొత్త కోణంలో ఆవిష్కరించారు. అలాగే 'సలార్'లో జగపతి బాబు, పృథ్వీరాజ్ సుకుమారన్ పాత్రలు కథకు బలమైన స్థంభాలుగా నిలిచాయి. అదే తరహాలో 'డ్రాగన్'లో అనిల్ కపూర్ పాత్ర కూడా కథను మలుపు తిప్పే స్థాయిలో ఉంటుందనే అంచనాలు పెరుగుతున్నాయి. ఈ భారీ ప్రాజెక్ట్‌ను మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్‌పై నవీన్ యెర్నేని, రవిశంకర్ యలమంచిలి నిర్మిస్తున్నారు. ఎన్టీఆర్‌కు జోడీగా రుక్మిణీ వసంత్ హీరోయిన్‌గా నటిస్తోంది. పాన్ ఇండియా స్థాయిలో తెరకెక్కుతున్న ఈ చిత్రం, ప్రశాంత్ నీల్ స్టైల్ మాస్ యాక్షన్‌తో పాటు స్ట్రాంగ్ ఎమోషనల్ క్యారెక్టర్ల మేళవింపుగా ఉండబోతుందని టాక్.



# పూరి, సేతుపతి మూవీ టైటిల్ స్లమ్ డాగ్

విజయ్ సేతుపతి `పూరి జగన్నాథ్ కాంబోలో రానున్న సినిమా టైటిల్ ఖరారయ్యింది. ఇప్పటివరకూ 'పూరి సేతుపతి'గా ప్రచారంలో ఉన్న ఈ సినిమా టైటిల్‌ను తాజాగా ప్రకటించారు. ఈ చిత్రానికి 'స్లమ్ డాగ్' అనే పేరు ఖరారు చేశారు. '33 టెంపుల్ రోడ్' అనేది ఉపశీర్షిక. టైటిల్ పోస్టర్‌లో విజయ్ సేతుపతి ఆసక్తికర లుక్‌లో కనిపించారు. చేతిలో కత్తి పట్టుకొని కళ్లజోడుతో పవర్‌ఫుల్‌గా ఉన్నారు. ఈ పోస్టర్‌ను పంచుకున్న టీమ్ ఆసక్తికర క్యాప్షన్‌ను షేర్ చేసింది. 'మురికివాడల నుంచి ఎవరూ తట్టుకోలేని తుపాను వస్తుంది.. అది చాలా భయంకరంగా ఉంటుంది' అనే క్యాప్షన్ ఇందులో విజయ్ పాత్ర తీరును తెలిపేలా ఉంది. ఎన్నో రోజులుగా ఈ సినిమాకు రకరకాల టైటిల్స్ వినిపించాయి. ఇప్పుడు వాటికి చెక్ పెడుతూ 'స్లమ్ డాగ్'ను అధికారికంగా ప్రకటించారు. గతేడాది జులై మొదటివారంలో ఈ సినిమా షూటింగ్ ప్రారంభించి ఐదు నెలల్లోనే కంప్లీట్ చేసేశారు. పాన్ ఇండియా స్థాయిలో ఇది విడుదల కానుంది. సంయుక్త కథానాయికగా నటించారు. టబు, విజయ్‌కుమార్ కీలక పాత్రలు పోషించారు. దేశవ్యాప్తంగా ఉన్న ప్రేక్షకుల్ని అలరించడమే లక్ష్యంగా ఓ వినూత్న కథాంశంతో ఈ చిత్రం ముస్తాబైంది. విజయ్ సేతుపతి ఇందులో మునుపెన్నడూ చేయని విభిన్నమైన పాత్రలో కనిపించనున్నారు.




# 70 ఏళ్ల వయసులో ఇంత ఎనర్జీ ఎక్కడిది..

మెగాస్టార్ సినిమాలతో తన బాల్యం, యవనాన్ని గుర్తు చేసుకుంటూ ఓ వీరాభిమాని చిరంజీవికి ఓ లేఖ రాశాడు. ఆ లేఖలో చిరంజీవి సినిమాలు తన జీవితానికి ఇచ్చిన ప్రేరణ, కుటుంబంతో కలిసి థియేటర్లలో చూసిన అనుభవాలు, అభిమానిగా ఎదిగిన ప్రయాణాన్ని భావోద్వేగంగా వివరించాడు.

## ఓయ్ ప్రసాదు? ఇదుగో నిన్నే..

'నిన్నేనయ్యా ప్రసాదూ. అసలు నువ్వేం చేస్తున్నావో నీకైనా అర్థమవుతుందా? ఏడు పదుల వయసులో జనాలు ఎంఆర్‌ఐ స్కాన్లు, ఎక్స్ రేలు, రక్త పరీక్షలు, డయాలసిస్ అంటూ డాక్టర్ల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్న కాలంలో హుక్కు స్టెప్పు హుక్కు స్టెప్పు అంటూ డ్యాన్సులు వేసి ఎవరిని రెచ్చగొడదామని నీ ప్లాన్. అసలు నాకొకటి అర్థం కాక అడుగుతాను. చిన్నప్పుడు యముడికి మొగుడు పాటను బ్లాక్ అండ్ వైట్ టీవీలో గుడ్లప్పగించి చూస్తుంటే మా నాన్న భుజం మీద చరిచి చెప్పేవాడు ఒంట్లో స్ప్రింగులు ఉన్నోడే చిరంజీవి అని'. అప్పుడర్థమయ్యేది కాదు. చెడ్డీలకు బటన్లు ఊడిపోతే పిన్లు పెట్టుకుని స్కూలుకు పరిగెత్తే మధ్య తరగతి జీవితాల్లో బ్లాక్ టికెట్లు కొనే వైరస్ తెచ్చింది నీ గ్యాంగ్ లీడర్, ఘరానా మొగుడు సినిమాలే. క్లాసులో బెంచీల మీద నీ డైలాగులు అప్పజెబుతూ టీచర్ కు దొరికిపోతే వీపు మీద కర్ర దెబ్బలు ఎందుకు నొప్పనిపించలేదో తెలుసా? బోలో బోలో బోలో రాణి క్యా చాహీయే అంటూ నువ్వు ఖాకీ కోటుని ఎగరేసి, తిరగేసి డాన్సు చేయడం గుర్తుకు వస్తే మాస్టారి బెత్తం దెబ్బ ఒక లెక్కా' 'సరే చిన్నప్పటి ముచ్చట్లు ఇప్పుడెందుకులే ప్రసాదు విషయానికి వద్దాం. ముందు ఒక మాట చెప్తా గుర్తు పెట్టుకో. నీ మనవళ్లు మనవరాళ్లతో ఆడుకుంటున్న వీడియోలు ఆడియోలు మాకు చూపెట్టకు. వాళ్ళు నిన్ను తాత అంటే ఒప్పుకునే పరిస్థితిలో మేం లేం. ఎందుకంటే నువ్వు మాకెప్పటికీ కాళీవి, ఆటో జానీవి, రాజువి, ఇప్పుడీ ప్రసాదువి. అంతే నో డిబేట్. శశిరేఖతో ప్రేమలో పడే సీన్లలో నీలో ఆ పెళ్లి కాని కళని మొహంలోకి ఎలా తీసుకొచ్చావో ఎంత రాకెట్ సైన్స్ చదివినవాడైనా చెప్పలేడు. నా పందెం పది వేలు. అమాయకత్వం, తింగరితనం కలగలసి నీ టైమింగ్ లో ప్రేక్షకులు మునకలు వేస్తుంటే ఒక ఇంటెలిజెంట్ సెక్యూరిటీ ఆఫీసర్ ఇంత సిల్లీగా ఉంటాడానే లాజిక్ మాకెందుకు గుర్తుకు వస్తుంది చెప్పు. గ్రేసుకే బాసులా ఒళ్ళు వయ్యారంగా తిప్పుతూ పక్కన నయనతార ఉన్న సంగతే మర్చిపోయేలా చేస్తే ఇద్దరి మధ్యా వయసు వ్యత్యాసాన్ని ఎలా గుర్తిస్తాం. అంత చిన్న పిల్లలు ఈ పెద్దాయన ప్రసాద్ కొడుకు కూతురాని నా కొడుక్కు అనిపించలేదంటే దాన్ని స్క్రీన్ ప్రెజెన్స్ అనాలా లేక మాస్ భాషలో దొంగ సచ్చినోడు అనాలా నాకైతే అర్థం కాలేదు' అంటూ లేఖను కొనసాగించాడు.



# శివాజీ చేసిన వ్యాఖ్యలు తప్పే

## నటుడు హర్షవర్ధన్ కామెంట్స్

స్వేచ్ఛలో దుస్తులు భాగం.. కానీ, దుస్తులు మాత్రమే స్వేచ్ఛ కాదన్నారు నటుడు హర్షవర్ధన్. కొన్ని రోజులుగా ఇండస్ట్రీలో హాట్ టాపిక్‌గా మారిన శివాజీ కామెంట్స్‌పై ఆయన ఇటీవల ఒక ఇంటర్వ్యూలో మాట్లాడారు. ప్రస్తుతం హర్ష కామెంట్స్ సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. సున్నితమైన విషయాన్ని బాగా వివరించారంటూ ఆయన్ను నెటిజన్లు సపోర్ట్ చేస్తున్నారు. 'దొంగల మనసు మార్చే కన్నా.. ఇంటికి తాళం వేసుకోవడం ఉత్తమం. అది నా చేతిలో ఉన్న పని. నా ఇంట్లో వాళ్లకు జాగ్రత్తగా ఉండండి అని చెప్పడం నాకు సులభం. అంతేకానీ, దొంగల్లారా ఆలోచించండి.. నేను లేని సమయంలో ఒంటరిగా ఉన్న నా వాళ్లపై దాడి చేయకండి అని దొంగలకు చెప్పడం కష్టం. గత కొన్ని రోజులుగా సాగుతోన్న అంశంపై ఆలోచిస్తే ఒక విషయం అర్థమవుతుంది. రెండు టాపిక్‌లను ఎప్పుడూ కలపకూడదు. స్వేచ్ఛ గురించి మాట్లాడితే దానిమీదే ఫోకస్ చేయాలి.. దుస్తుల గురించి అయితే వాటి గురించే మాట్లాడాలి. మంచి ఉద్దేశంతో ఏదైనా చెప్పాలనుకున్నప్పుడు మాట్లాడేతీరు సరిగ్గా లేకపోతే వాళ్లు శివాజీ, అనసూయలు అవుతారు. మనం ఉంటున్న ప్రదేశాన్ని బట్టి కూడా మన డ్రెస్సింగ్ ఆధారపడి ఉంటుంది అని హర్షవర్ధన్ చెప్పారు.





# ప్రభుత్వ ఆదాయానికి రూ.3.72కోట్ల గండి

- పోలీసుల అదుపులో 15 మంది నిందితులు
- పరారీలో మరో 9 మంది

**వరంగల్ వాయిస్, క్రైం :** జనగామ, యాదాద్రి జిల్లాల్లో ధరణి, భూభారతీ రిజిస్ట్రేషన్లలో రూ.3.72కోట్ల కుంభకోణంతో ప్రభుత్వ అదాయానికి గండి కొట్టి రాష్ట్రంలోనే సంచలం సృష్టించిన ముఠాలోని 15 మందిని జనగామ పోలీసులు అరెస్టు చేయగా, మరో తొమ్మిది మంది పరారీలో ఉన్నారు. అరెస్టు చేసిన ముఠా సభ్యుల నుంచి రూ.63.19 లక్షల నగదు, బ్యాంకులో రూ. 1లక్ష, సుమారు రూ. ఒక కోటి విలువైన ఆస్తి పత్రాలు, ఒక కారు, రెండు ల్యాప్ టాపులు, ఐదు డెస్క్ టాప్ కంప్యూటర్లు, 17 సెల్ ఫోన్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు అరెస్టు చేసిన వారిలో యాదాద్రి జిల్లాకు చెందిన పసునూరి బసవ రాజు, జెల్లా పాండ, మహేశ్వరం గణేష్ కుమార్, అలేటి నాగరాజు, జనగామ జిల్లాకు చెందిన ఈగజులపాటి శ్రీనాథ్, కోదురి శ్రావణ్, యెనగంధుల వెంకటేష్, కొడకండ్లకు చెందిన కొలిపాక సతీష్ కుమార్, నర్మెట్టకు చెందిన తడూరి రంజిత్ కుమార్, యాదాద్రి జిల్లా ఆత్మకూర్ (ఎం)కు చెందిన దుంపల కిషన్ రెడ్డి, తుర్కపల్లికి చెందిన దశరథ మేఘావత్, యాదగిరి గుట్టకు చెందిన నారా భాను ప్రసాద్, గొపగాను శ్రీనాథ్, ఒగ్గు కర్నాకర్, నల్లగొండకు చెందిన కమల్ల శివ కుమార్ గా పోలీసులు గుర్తించారు.

ఈ అరెస్టు సంబంధించి వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ వివరాలను వెల్లడిస్తూ ఈ కుంభకోణంలో ప్రధాన నిందితులైన పసునూరి బసవరాజు, జెల్లా పాండు ఇరువురు యాదాద్రి-భువనగిరి జిల్లా యాదగిరి గుట్లలో అన్లైన్ సర్వీస్ నిర్వహించేవారు. ఈ సర్వీస్ ద్వారా నిందితులు అన్లైన్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసేవారు. ఇదే సమయంలో నిందితులు రిజిస్ట్రేషన్ పత్రాలకు సంబందించిన ప్రభుత్వనికి చెల్లించాల్సిన రుసుము చెల్లించే సమయంలో కొన్ని మార్లు సాంకేతిక సమస్యలు ఎదురయ్యేవి. అదే విధంగా భూభారతి, ధరణి వెబ్ సైట్లలోని లోపాలను వారికి అనుకూలంగా మార్చుకునేందుంకు పలుమార్లు ప్రయత్నించారు. ఇదే క్రమంలో నిందితులు మొబైల్ అప్లికేషన్ ను ఉపయోగించి నిందితులు ప్రభుత్వానికి చెల్లించిన రుసుముకు సంబంధించి వెబ్ సైట్ లో జారీ అయిన రసీదులను చెల్లించాల్సిన దాని కంటే తక్కువగా మార్పు చేసి అనంతరం మార్పు చేసిన రుసుమును మాత్రమే ప్రభుత్వానికి చెల్లించి స్థానిక ఎమ్మార్వో, రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో మద్యవర్తుల ద్వారా రిజిస్ట్రేషన్లు చేయిస్తూ ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి కొట్టారని పేర్కొన్నారు. ఈ విధంగా ప్రధాన నిందితులు ఇద్దరు సులభంగా డబ్బు సంపాదించడానికి అలవాటు పడ్డారన్నారు. జిల్లాల్లోని మీ సేవ, ఆన్లైన్ సర్వీసులు, మద్యవర్తుల వద్ద నమోదు కావాల్సిన ధరణి, భూ భారతి రిజిస్ట్రేషన్ పత్రాలను ప్రధాన నిందితులు తమ వద్దనే వెబ్ సైట్లో నమోదు చేసేవారు. ఇందుగాను ప్రధాన నిందితులు మిగితా వారికి పది నుంచి 30శాతం వరకు కమిషన్ చెల్లించేవారు. ఈ కేసుకు సంబంధించి జనగామ, యాద్రాద్రి జిల్లాల్లో 1,080 పత్రాలకు సంబందించిన లావా దేవీల్లో నిందితులు మోసాలకు పాల్పడినట్లు తెలిపారు. అలాగే ఈ రెండు జిల్లాలో జరిగిన ఈ కుంభకోణానికి సంబంధించి 22 కేసులు నమోదయ్యాయన్నారు.ఇందులో జనగామ జిల్లాలో ఏడు కేసులు, యాదాద్రి జిల్లాలో 15 కేసులు నమోదు అయినట్లు వరంగల్ పోలీస్ కమిషనర్ వెల్లడించారు. ఈ ముఠాను పట్టుకోవడం ప్రతిభ కనబరిచిన జనగామ డీసీపీ రాజమహేంద్ర నాయక్, ఏఎస్పీ పండరి చేతన్, జనగామ ఇన్ స్పెక్టర్ సత్యనారయణ రెడ్డి, రఘునాథ్ పల్లి సర్కిల్ ఇన్ స్పెక్టర్ శ్రీనివాస్ రెడ్డితో పాటు ఇతర ఎస్ఐలు, సిబ్బందిని పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ అభినందించారు.

# ఫలించిన ఎంపీ కృషి



**వరంగల్ వాయిస్, వరంగల్ :** వరంగల్ నగర ప్రజలకు మెరుగైన ఆరోగ్య సేవలు అందించాలనే లక్ష్యంతో వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య ఏడాదిన్నర కాలం చేసిన కృషి ఫలించింది. వరంగల్ జిల్లాలో వెల్‌నెస్ సెంటర్ ఏర్పాటుకు నాలుగు అనువైన ప్రభుత్వ కార్యాలయాలను అధికారులతో కలిసి ఎంపీ స్వయంగా పరిశీలించారు. వాటిలో వరంగల్ పరిధిలోని ఆకాశవాణి సిబ్బంది క్వార్టర్స్‌లో కొత్తగా వెల్‌నెస్ సెంటర్‌ను ఏర్పాటు చేయడానికి కేంద్ర ప్రభుత్వం అనుమతి మంజూరు చేసింది. ఈ మేరకు కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది. సుదీర్ఘకాలంగా పెండింగ్ లో ఉన్న వరంగల్ వెల్‌నెస్ సెంటర్ ఏర్పాటుకు కడియం కావ్య పార్లమెంట్ సమావేశాలతోపాటు, కేంద్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ అధికారులతో నిరంతర సంప్రదింపులు జరిపినందునే వెల్ నెస్ సెంటర్ సారాకం అయిందన్నారు. ఈ సందర్భంగా వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య మాట్లాడుతూ.. దేశవ్యాప్తంగా 22 వెల్‌నెస్ సెంటర్‌లకు మంజూరు లభించగా, వరంగల్ జిల్లాకు మాత్రమే పూర్తి అనుమతులు లభించాయన్నారు. వెల్‌నెస్ సెంటర్‌ను తన ఎంపీ నిధుల ద్వారా కార్పొరేట్ స్థాయిలో అభివృద్ధి చేస్తానని స్పష్టం చేశారు. వరంగల్ పరిధిలో ఉన్న 54 ప్రధాన పట్టణాల్లో నివసిస్తున్న 15 వేల మందికి పైగా కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లు, వారి కుటుంబాలకు ఆరోగ్య సేవల సదుపాయాలు అందించడంలో ఈ వెల్‌నెస్ సెంటర్ ఎంతో ఉపయోగపడుతుందన్నారు. వెల్‌నెస్ సెంటర్ ద్వారా ఉద్యోగులు, పెన్షనర్లు, వారి కుటుంబాలకు వైద్య–ఆరోగ్య సంబంధిత సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయని ఎంపీ తెలిపారు. తన విన్నపాల పట్ల సానుకూలంగా స్పందించి వెల్‌నెస్ సెంటర్ మంజూరు చేసిన ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ మంత్రికి ఎంపీ కృతజ్ఞతలు తెలిపారు. వరంగల్‌కు మంజూరైన వెల్‌నెస్ సెంటర్‌లో వెంటనే పనులు ప్రారంభించాలని సీజీహెచ్ఎస్ డైరెక్టర్ రోహిణిని ఎంపీ కోరారు.

# శ్రీ దూడల మల్లికార్జున స్వామి జాతరలో ఎర్రబెల్లి

**వరంగల్ వాయిస్, పర్వతగిరి:** పర్వతగిరి మండలంలోని గోపనపల్లి శ్రీ దూడల మల్లికార్జున స్వామి జాతర శుక్రవారం ఘనంగా నిర్వహించారు. జాతరకు మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. జాతరకు సుమారు 30వేల మంది భక్తులు హాజరైనట్లు ఈఓ రత్నాకర్ రెడ్డి వెల్లడించారు. కనుమ రోజు జాతరలో భక్తులు పట్నాలు వేసి బోనాలు, నైవేద్యం సమర్పించడం ఆనవాయితాగా వస్తోంది. భక్తులు అధిక సంఖ్యలో క్యూ లైన్ లో వేచి ఉండి స్వామివారి దర్శనాన్ని పొందారు. వచ్చిన భక్తులకు ఈవో రత్నాకర్ రెడ్డి అన్ని రకాల సదుపాయాలు కల్పించారు. స్థానిక గ్రామ యువజన సంఘాల ఆధ్వర్యంలో వచ్చిన భక్తులకు మహా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

# విజేతలకు బహుమతులు అందజేత



**వరంగల్ వాయిస్, కరీమాబాద్ :** వరంగల్ నగరం రంగశాయిపేటలోని కాకతీయ సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన ఇంటింటా ముగ్గుల పోటీల్లో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మిత్ర పరపతి సంఘం అధ్యక్షులు చిగిరి కుమారస్వామి హాజరై విజేతలకు బహుమతులు అందించారు. కాకతీయ సేవా సమితి అధ్యక్షులు మండల నరసింహా రాములు సభాధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి న్యాయ నిర్ణేతలుగా జక్కం దామోదర్, ఏలుగు రవికుమార్, మానుపాటి వెంకటేశ్వర్లు, బొలిశెట్టి కమలాకర్, పాకాల రవీందర్ వ్యవహరించారు. అనంతరం ముఖ్యఅతిథిగా విచ్చేసిన కుమారస్వామి మాట్లాడుతూ ఉమ్మడి తెలుగు రాష్ట్రాల్లో సంక్రాంతి పండుగకు ప్రత్యేక గుర్తింపు ఉందన్నారు. ఈ సందర్భంగా ప్రతి ఇంటి ముందు ఆడపడుచులు తెల్లవారుజామునే లేచి ముగ్గులు వేసి మన సంస్కృతిని కాపాడుతున్నారన్నారు. ఈ పోటీల్లో ప్రథమ బహుమతి తత్తరి హన్సిక, ద్వితీయ బహుమతి గుండు నవనీత, తృతీయ బహుమతి మోతే నిశాంక, కన్సోలేషన్ బహుమతి విజేతలుగా కొంగండి పవిత్ర, మండల మాధురి, కొత్త బాయి సులోచన, పాకాల కృష్ణవేణి, భక్తి హిందూ వనం చంద్రకళ, తాళ్ల పెల్లి అనూష, గోధుమల హాసిని, గోశాల మాధవి, బర్దే సంధ్యారాణి, శ్యామల, అరుణాజ్యోతి, సోమ మానస, కటకం రాధిక, ముత్తినేని మానస, చిట్ల హేమలత, కోల మానస, కడుదుల శృతి, కృష్ణ మందిని ఎంపిక చేసి బహుమతులు అందజేశారు.

# ఘనంగా ముగ్గుల పోటీలు



**వరంగల్ వాయిస్, మహాదేవపూర్ :** జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండలం కాళేశ్వరం గ్రామంలో, ఆంధ్రప్రదేశ్ మాజీ స్పీకర్ స్వర్గీయ శ్రీపాద రావు స్మారకార్థం, మకర సంక్రాంతి, కనుమ పండగలను పురస్కరించుకొని మహిళల కోసం ప్రత్యేకంగా ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని కాళేశ్వరం మాజీ ఎంపీటీసీ రేవెల్లి మమత నాగరాజు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ ముగ్గుల పోటీలు కాళేశ్వరం ఈఓ కార్యాలయం ఆవరణంలో నిర్వహించగా, గ్రామ మహిళలు కవిత, స్రవంతి, సుప్రజ, సజ్జు, మానస, విజయ సమన్వయంతో పోటీలను సజావుగా నిర్వహించారు. గ్రామంలోని మహిళా సభ్యులందరూ చురుకుగా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ పోటీల్లో గ్రామానికి చెందిన సుమారు 200 మంది మహిళలు పాల్గొనగా, మొత్తం 60 అందమైన రంగురంగుల ముగ్గులు వేశారు. పోటీల్లో మొదటి బహుమతి దూది వర్షితకు, రెండవ బహుమతి మౌనికకు, మూడవ బహుమతి రవలికి లభించాయి. అలాగే పోటీల్లో పాల్గొన్న మహిళలందరికీ ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న కాటారం డీఎస్పీ సూర్యనారాయణ మాట్లాడుతూ, మన సంప్రదాయాలను ప్రతిబింబించే ముగ్గుల పోటీలు మహిళల సృజనాత్మకతను వెలికి తీస్తాయి. మహిళలు అన్ని రంగాల్లో ముందుకు రావాలి. గ్రామీణ స్థాయిలో ఇలాంటి సాంస్కృతిక కార్యక్రమాలు జరగడం అభినందనీయం అని అన్నారు. ఈ కార్యక్రమంలో మహాదేవపూర్ సీఐ వెంకటేశ్వర్లు, కాళేశ్వరం ఎస్ఐ తమాషా రెడ్డి, జిల్లా బ్లాక్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి మెంగాని అశోక్, మండల కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి మాడుగుల పవన్ శర్మ, కాళేశ్వరం ఈఓ మహేష్, వార్డు మెంబర్లు ఇమ్రాన్, రాజశేఖర్, మాజీ ఆలయ ధర్మకర్త గందేసిరి సత్యనారాయణ, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY GADDAM KESHAVA MURTHY, PRINTED AT MANIKANTA GRAPHICS, H.NO.4-10-121, KUMARPALLY, HANAMKONDA, WARANGAL URBAN DISTRICT-506001, TELANGANA STATE, PUBLISHED AT H.NO. 4- 7-138/1, KUMARPALLY, HANAMKONDA, WARANGAL.-506001. WARANGAL URBAN DISTRICT, TELANGANA STATE.
EDITOR : GADDAM KESHAVA MURTHY. RNI NO: TELTEL/2021/80377, PHONE NO : 8008794162, MAIL ID : gaddamkeshavamurthy@gmail.com